
# తూర్పు-పడమర



తన క్రైస్లర్ కారుని డ్రైవ్ వేలో నిలిపి, ఇంట్లోకి వచ్చాడు రాజు. పొద్దుట నుంచీ ఆఫీసులో నానా హైరానపడి, అలసి సొలసి ఇంటికి వచ్చాడు.

లోపలకు వచ్చి ఫ్రిడ్జ్‌లోనించి ఆరెంజ్ జ్యూస్ గ్లాసులో పోసుకొని, సోఫాలో జేరగిల బడి, స్టీరియో ఆన్ చేశాడు. పాత సినిమాల్లోని తెలుగు పాటలు సన్నగా వినపడుతున్నాయి.

అప్పుడే బెడ్ రూమ్‌లో నించి చేతిలో కార్డ్‌లెస్ ఫోన్‌తో వచ్చింది లలిత.

రాజుని చూసి, 'వచ్చేశావా' అంటూ వచ్చి పక్కనే కూర్చుంది. ఆమె ముఖంలో ఏదో ఆలోచన. ఏదో చెప్పాలనే ఆరాటం వున్నా వెనకా ముందులాడుతున్నట్టు తెలుస్తూనే వుంది.

రాజు అడిగాడు "ఏమిటి అలా వున్నావ్ దిగులుగా?"

"ఏమీలేదు...." ఒక్కక్షణం ఆగి మళ్ళీ అంది లలిత - "గీత ఫోన్ చేసింది ఇందాకే... చికాగో నించి"

"ఏమిటి? మళ్ళీ కారు ఏక్సిడెంటు ఏమన్నా చేసిందా"?

"కారు కాదు"

"మరి"

"మీరు ఇన్నాళ్లూ ఏది వినకూడదనుకుంటున్నారో అదే జరిగింది. జరుగుతున్నది" అన్నది లలిత నెమ్మదిగా.

"ఏమయింది. సరిగ్గా చెప్పు" అడిగాడు రాజు అసహనంగా.

"మీ అమ్మాయి ఫోన్ చేసింది. నార్త్‌వెస్ట్ యూనివర్శిటీలోనే వాళ్ల క్లాసులోనే వున్న ఒకబ్బాయి, తనూ ప్రేమించుకున్నారుట, పెళ్లిచేసుకుంటారట..."

"పిహెచ్.డి చేస్తానని వెళ్లి, ఇదా గీత చేస్తున్న నిర్వాకం" విసురుగా అన్నాడు రాజు.

"దానికి ఇరవై అయిదేళ్లు వస్తున్నాయి. చిన్నపిల్ల కాదు. ఇండియాలో వుంటే ఈపాటికి పెళ్లి చేసేవాళ్లం కూడాను".

"అయితే...." రాజు అన్నాడుకానీ, అతని మనస్సులో వెంటనే ఏదో స్ఫురించటంతో, చటుక్కున తల ఎత్తి లలితను అడిగాడు.

"ఎవరతను, మనవాడేనా?... మన కులం వాడేనా అని..."

"కాదు" అంది లలిత.

"కనీసం తెలుగువాడేనా"

"కాదు" అంది లలిత నెమ్మదిగా.

"ఎవడు, పంజాబీ వాడా" తన అనుమానాన్ని పక్కన పెడుతూ అన్నాడు రాజు.

"కాదు... అమెరికన్. పేరు జఫ్ అని చెప్పింది."

"దీనికింతకన్నా ప్రాణనాధుడెవరూ దొరకలేదా? అటు కులమూ, మతమూ, దేశమూ ఏదీ కాకుండా ఈ తెల్లవాడు ఎక్కడ దొరికాడు?" అని మళ్లీ అతని మనసులో ఏదో అనుమానం రాగానే అడిగాడు "అసలు తెల్లవాడేనా, నల్లవాడా?"

"తెలీదు, అమెరికన్ అనే చెప్పింది" అన్నది లలిత తల వంచుతూ.

"ఈ పెళ్లి జరగటానికి వీల్లేదు. ఎలా జరుగుతుందో చూస్తాను" అన్నాడు రాజు దృఢంగా.

"నేను ఇందాక గీతతో అన్నాను ఆ మాట. మీ నాన్నకు ఇలాటివి నచ్చవు. పొరపాటున కూడా ఒప్పుకోరు మీ పెళ్ళికి అని"

"ఏమన్నది?" అడిగాడు రాజు.

లలిత మాట్లాడలేదు.

"చెప్పు. అదేం చెప్పిందో సరిగ్గా చెప్పు" అతనకి పూర్తిగా సహనం పోతోంది.

ఒక్కక్షణం ఆగి, "ఇది ఇండియా కాదు. మీ ఇష్టం వచ్చినవాడిని డబ్బులతో కొనుక్కొచ్చి నా తల వంచి పెళ్లిచేస్తే తలూపుతూ పెళ్లిచేసుకోవటానికి. ఇది నా జీవితం. నా ఇష్టం. మీరు వచ్చి మాకు శుభాకాంక్షలు చెబితే సంతోషిస్తాం. అలా రాకపోయినా, ఈ పెళ్లి మాత్రం ఆగదు అని చెప్పింది."

రాజులోని కోపం తారాస్థాయికి చేరుకుంది. "అంత దాకా తెగించిందీ! కూచిపూడి డాన్సూ, త్యాగరాజు పాటలూ నేర్చుకుంటుంటే మన దేశం, సంస్కృతి మీద ఉత్సాహం చూపిస్తున్నదనుకున్నాను కానీ, ఇలా మన కులం, మతం దేశంకాని వెధవతో...."

"అతను వెధవ కాదు అని చెప్పింది గీత. అతను కూడా పిహెచ్.డి చేస్తున్నాడట. అంతా స్కాలర్‌షిప్పుల మీదే చదువుతున్నాడనీ, చాలా మంచివాడనీ, తెలివిగలవాడనీ చెప్పింది."

"ఇద్దరిమధ్యా ఏదన్నా శారీరకంగా..." రాజు మాటల్లో కొంచెం వేగం తగ్గింది.

లలిత తల వంచుకుంది, "నాకు తెలీదు, నేను అడగలేదు. అది చెప్పలేదు"

రాజు రెండు నిమిషాలు మాట్లాడలేదు. గదిలో అతను, ఒక మూల నించి ఇంకో మూలకి హడావిడిగా చేస్తున్న పచార్లు చూస్తుంటే అతని మనసు మనసులో లేదనీ, ఆలోచనలు అతన్ని కలచివేస్తున్నాయనీ తెలుస్తూనే వుంది.

మళ్లీ లలితే అంది, "మనమ్మాయిని పెళ్ళి చేసుకోటానికి, ఆ అబ్బాయి తల్లిదండ్రులు ఏమాత్రం ఒప్పుకోవటంలేదట"

"ఏం ఎందుకని మనమ్మాయికి చదువులేదా, అందం లేదా, మతం తక్కువా, కులం తక్కువా..." అసంకల్పితంగా వచ్చిన తన మాటలకు తనే ఆశ్చర్యపోయాడు రాజు. ఇంతవరకూ ఎఫెన్సివ్‌గా వస్తున్న తన మాటలు డిఫెన్సివ్‌గా మారటం అతనికే వింతగా వుంది.

లలిత ఈ సారి కొంచెం గట్టిగానే అంది. "అవును, సరిగ్గా అదే అన్నారట వాళ్లు. ఈ అమ్మాయి మన మతం కాదు, మన దేశం కాదు'

"దేశం కాకపోవటమేమిటి? అది ఇరవై నాలుగేళ్ళ క్రితం అమెరికాలో పుట్టింది. షి ఈజ్ ఏన్ అమెరికన్?"

"అవన్నీ నాకు తెలీదు. అది చెప్పిన మాటలు చెబుతున్నాను. ఆ అబ్బాయి తల్లి దండ్రులకు బాగా పట్టింపు, మతాభిమానం కలవాళ్లు అని జఫ్ చెప్పాడుట. వాళ్ళ నాన్నకు, కెకెకె (క్రూక్లక్స్‌క్లాన్ అని తెల్లవాళ్ల ఆధిక్యతను సమర్థించే సంస్థ) సంబంధాలు కూడా వున్నాయిట. వాళ్లకు నల్లవాళ్లన్నా, విదేశీయులన్నా పడదు మరి..."

చటుక్కున తలెత్తి, వింతగా చూశాడు రాజు.

లలిత అంటోంది "వాళ్ళ ఉద్దేశ్యంలో మనం అంటరాని వాళ్లం. వాళ్లతోపాటుగా పక్కనే కూర్చునే అర్హత మనకు లేదని వాళ్ల ఉద్దేశ్యం. అందుకని జఫ్ తల్లిదండ్రులు ఈ పెళ్లికి ఇష్టపడటం లేదుట..."

లలిత ఆ మాట అనగానే రాజు చెంప మీద ఎవరో ఛెళ్లుమని కొట్టినట్టయింది.

ఏమిటో మనలో వుండి, వాళ్ళల్లో లేని ఆ అంటరానితనం?

అతని ఆలోచనలు ముప్ఫయి సంవత్సరాలు వెనక్కి వెళ్లాయి. ముప్ఫయి సంవత్సరాల క్రితం ఆ చెంప ఛెళ్ళుమన్నది తనకి కాదు. తన అన్న గోపీకి.

ఉండేది గుడివాడలోనే అయినా, తమ భూములన్నీ పక్కనే వున్న పల్లెటూళ్లో వుండటంవలన గోపీ ఆ వూరు వెళ్లి పొలాల పని చూసుకుని వస్తూ వుండేవాడు. గోపీ చదువులో కూడా అంత ఉత్సాహం చూపించకపోవటం వల్ల, తన తండ్రి పొలాల నిర్వహణ అంతా అతనికి వదిలేశాడు. అప్పుడే గోపీ, తన పొలంలో పనిచేసే ఒకమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడు. అంతటితో ఆగక, ఆ అమ్మాయినే పెళ్లిచేసుకుంటానని పట్టు కూడా పట్టాడు.

అది విని, తన తల్లిదండ్రులేకాక, అక్కడి భూస్వామి వర్గం అంతా ఆ పెళ్లికి ఎదురు నిలిచారు. కారణం ఆ పిల్లది 'అంటరాని' కులం అనీ, తమ అంతస్థుకీ, స్థాయికీ సరితూగదనీ.

"అయినాసరే... నేను మాత్రం ఆ అమ్మాయినే పెళ్లిచేసుకుంటాను" అని భీష్మించుకు కూర్చున్నాడు గోపి.

ఆ అమ్మాయినీ, ఆమె తల్లిదండ్రులనీ రహస్యంగా వూరు విడిచి, చాలా దూరంగా వెళ్లిపోతే, ఇంతిస్తాం, అంతిస్తాం అని ఆశపెట్టారు కూడాను. ఆ అమ్మాయి కూడా గోపీని విడిచి ఉండలేనని గట్టిగా చెప్పింది.

ఎవ్వరూ ఏమీ చేయలేకపోయారు.

కానీ వారం రోజులు తిరిగేలోగానే, వూరి బయట మాలపల్లెలో నిద్రపోతున్న ఆ అమ్మాయి, ఆమె తమ్ముడూ, తల్లిదండ్రులూ, గుడెసెకు నిప్పంటుకున్న కారణంగా అగ్నికి అహుతి అయిపోయారు.

"వంట చేసుకున్న తర్వాత, పొయ్యిలో కట్టెలు పూర్తిగా ఆర్పకపోతే మరి ఏమవుతుందీ" అన్నారు మునసబూ, కరణమూ, పోలీసులూ.

"అంటరానివాళ్లు. అగ్రకులాల వాళ్లతో వియ్యం పొందాలని ఆశపడితే, మరి దేవుడు

వూరు కుంటాడా" అన్నారు భూస్వాములు.

తనకు చూచాయిగా తెలుసు ఏంజరిగిందో. తనూ అలాటి అగ్రజాతివాడే అవటం వలన, ఆ పెద్దలు చెప్పిన దాంట్లో తప్పేమీ కనపడలేదు. అంతేకాదు. ఆ కులాభిమానాన్ని అమెరికా వచ్చి కూడా చాలా జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాడు.

భారతదేశంలో అగ్రజాతికి చెందిన తను, ఈ అమెరికా దేశంలో ఈ తెల్లజాతి అహంకారుల కెకెకె దృష్టిలో అంటరానివాడయ్యాడు. తనూ, తన భార్య. తన కూతురూ, ముగ్గురూ అంటరాని వాళ్ళే!

రాజు తల తిరిగిపోయింది.

అగ్రకుల అహంకారానికి తలవంచిన తన అన్న గోపి, తల్లిదండ్రులనెదిరించి తన జాతికి చెందని గీతను పెళ్ళి చేసుకుంటున్న జఫ్.

వర్ణ వ్యవస్థకు ఆహుతి అయిపోయిన మాలపిల్ల, తన వ్యక్తిత్వాన్ని చూపిస్తూ తన జీవితంలో కోరినవి పొందబోతున్న తన కూతురు గీత.

ఏమిటి అమెరికాలో మనలో వుండి, తెల్ల వాళ్ళల్లోలేని ఈ అంటరానితనం?

ఇండియాలో, మనలోలేని హరిజనులలో వున్న ఆ అంటరానితనం?

అతని కళ్ల ముందు ఏవో దీపాలు కదలాడుతున్నాయి. అవి, అతని దృష్టిని గజిబిజి చేస్తున్న దీపాలా? వెలుగు చూపిస్తున్న దీపాలా?

స్టీరియోలో 'తూర్పు-పడమర ఎదురెదురు' అన్న పాట వినిపిస్తోంది. ●

*(విపుల మాస పత్రిక: జూన్ 1999)*